సాక్షి చిత్తూరు

గురువారం । 21 । సెప్టెంబర్ । 2023



టిడ్కో కాలనీ పనులు వేగవంతం

జిల్లాలో టిడ్కో కాలనీల పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. - IIలో



వెళ్లిరా..వినాయక

చిత్తూరులో గణనాథుల నిమజ్జన శోభాయాత్ర కనులపండువగా సాగింది. కట్టమంచి చెరువులో నిమజ్జనం చేశారు. - IIలో

	గరిష్ఠం	కనిష్ఠం
చిత్తూరు	33	24
తిరుపతి	34	25
తిరుమల	29	21
గూడూరు	36	27
నగరి	34	25

న్యూస్‌రీల్

పకడ్బందీగా ఆరోగ్య సురక్ష

చిత్తూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని బాధ్యతతో చేపట్టాలని డీఎం అండ్‌హెచ్ ప్రభావతిదేవి ఆదేశించారు. చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో ఆమె బుధవారం అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జిల్లాలో పకడ్బందీగా జరిగేలా చూడాలన్నారు. ఇంటింటి సర్వే పక్కాగా జరిగేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఈనెల 30 నుంచి జరిగే మెగా మెడికల్ క్యాంపులను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో డీఐఓ రవిరాజు, జిల్లా క్షయ నివారణ అధికారి వెంకట ప్రసాద్, ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్ సుదర్శన్, వైద్యులు సందీప్, వాణిశ్రీ, రేణుక ప్రభ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీకి 20 టన్నుల కూరగాయలు



కూరగాయలను పంపుతున్న శ్రీవారి సేవకులు

పలమనేరు : తిరుమలలో జరుగుతున్న శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా అన్నదాన సత్రానికి బుధవారం 20 టన్నుల వివిధ రకాల కూరగాయలను పలమనేరు శ్రీవారి సేవకులు ప్రత్యేక వాహనంలో పంపారు. వాహనానికి పలమనేరు మార్కెట్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి గోవింద నామస్మరణతో కొండకు పంపించారు. ఈ సందర్భంగా శ్రీవారి సేవకుడు కాబ్బల్లి రవీంద్రారెడ్డి మాట్లాడుతూ టీటీడీకి కూరగాయలను పంపడంలో రాష్ట్రంలోనే పలమనేరు రెండో స్థానంలో నిలిచిందన్నారు. పలమనేరు సమీపంలోని కర్ణాటక రాష్ట్రం వడ్డిపల్లె మార్కెట్ నుంచి వివిధ రకాల కూరగాయలను సేకరించి పంపామని, దాతలకు ఆ దేవదేవుని కరుణాకటాక్షాలు లభించాలని కోరారు.

డీసీహెచ్‌ఎస్‌గా రాజశేఖర్‌రెడ్డి



రాజశేఖర్‌రెడ్డికి అభినందనలు చెబుతున్న ఉద్యోగులు

చిత్తూరు రూరల్: ఇన్‌చార్జి డీసీహెచ్‌ఎస్‌గా రాజశేఖర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ పోస్టులో పనిచేస్తున్న బీఎస్‌కే నాయక్ కలెక్టర్ ఆదేశాలతో రిలీవ్ అయ్యారు. జిల్లా ఆరోగ్యశ్రీ కోర్డినేటర్ రాజశేఖర్‌రెడ్డికి ఇన్‌చార్జ్ బాధ్యతలను అప్పగించారు. ఈమేరకు ఆయన బాధ్యతలను స్వీకరించి ఆస్పత్రి సేవలపై ఆరా తీశారు. పలువురు ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు.

టీచర్ పోస్టుల మదింపు పూర్తి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్ పోస్టుల మదింపు (కేడర్‌స్ట్రెంగ్త్) ప్రక్రియ పూర్తి అయినట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. ఈ ప్రక్రియ ముగియడంతో టీచర్ల వేత నాల చెల్లింపులో ఉన్న సమస్యలు తొలిగాయని చెప్పారు. జిల్లాలో ఉన్న పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టీచర్ పోస్టుల మదింపు ప్రక్రియ పూర్తి చేసి ఉన్నతాధికారులకు వివరాలు పంపినట్లు తెలిపారు.

30 వరకు ఇంటర్ ఫీజు చెల్లింపు గడువు

చిత్తూరు కలెక్టరేట్ : గత విద్యాసంవత్సరంలో ఇంటర్ పరీక్షలు ఫెయిల్ అయిన వారు, మధ్యలో మానేసిన ఇంటర్ విద్యార్థులు ఈనెల 30 వరకు ఫీజు చెల్లించవచ్చని ఆర్‌ఐవో ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సంబంధిత విద్యార్థులు ఆయా కళాశాలల్లో ఫీజును చెల్లించవచ్చన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన పరీక్ష ఫీజులను మాత్రమే ప్రిన్సిపాళ్లు వసూలు చేయాలని చెప్పారు. ప్రైవేట్ కళాశాలల్లో అధికంగా ఫీజులు వసూలు చేస్తే చర్యలుంటాయని ఆయన హెచ్చరించారు.

గరుడ సేవకు టూవీలర్స్ నిషేధం

తిరుమల: శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సెప్టెంబర్ 22న గరుడ సేవను దృష్టిలో ఉంచుకుని 21 సాయంత్రం 6 గంటల నుంచి 23వ తేదీ ఉదయం 6 గంటల వరకు ఘాట్ రోడ్లలో ద్విచక్ర వాహనాల రాకపోకలను టీటీడీ రద్దు చేసింది. తిరుపతిలోని అలిపిరి పాత చెక్ పాయింట్ వద్ద వాహనాలను పార్కింగ్ చేసుకునే వెసులుబాటు కల్పించింది.

నిమిషానికి రెండు బస్సులు

గరుడ సేవకు ప్రతి నిమిషానికి రెండు బస్సు ల చొప్పున నడుపుతామని డీపీటీఓ తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో సాధారణ రోజుల్లో నిమిషానికి ఒక్క సర్వీస్ చొప్పున రోజుకు 3,930 ట్రిప్పులు, అదే గరుడోత్సవం రోజున నిమిషానికి రెండు సర్వీసుల చొప్పున 5,456 ట్రిప్పులు తిప్పుతామని ఆయన స్పష్టం చేశారు.

స్వర్ణ మయూరంపై శివపుత్రుడు

కాణిపాకం స్వయంభు శ్రీవరసిద్ధి వినాయకస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు బుధవారం రాత్రి స్వర్ణ మయూర వాహనంపై శ్రీసిద్ధి,బుద్ధి సమేతంగా స్వామివారు తిరువీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారు విహరిస్తుంటే భక్తులు వీక్షించి తరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



స్వర్ణ మయూరంపై విహరిస్తున్న గణనాథుడు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవ వాహన సేవలు నయనానందకరంగా జరుగుతున్నాయి. బుధవారం ఉదయం స్వామివారికి పంచామృత అభిషేకం, ప్రత్యేక పూజలు, అలంకరణలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం మయూర వాహన ఉభయదారులు ప్రత్యేకంగా అభిషేక పూజలు నిర్వహించారు. రాత్రి అలంకార మండపంలో శ్రీసిద్ధి, బుద్ధి సమేత స్వామివారి ఉత్సవ మూర్తులను పట్టుపీతాంబరాలు. పరిమళభరిత పుష్పమాలికలు, విశేషాభరణాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదుపరి ఉత్సవ మూర్తులను ఉభయదారులు, ఆలయ అధికారులు భుజాలపై మోసుకుంటూ ఊరేగింపుగా తీసుకు వచ్చి బంగారు మయూర వాహనంపై ఆశీనులను చేశారు. అనంతరం మేళ తాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఆలయ తిరువీధుల్లో స్వామివారు విహరించారు. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించారు. దేవస్థానం చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు, ఏఈఓలు స్థానిక సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు మూషిక వాహనం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి స్వామివారు మూషిక వాహనంపై విహరించనున్నారు.

వినాయకునికి పరదాల వితరణ

వరసిద్ధి వినాయక స్వామికి తిరుపతికి చెందిన టైలర్ మణి మూడు పరదాలు విరాళంగా ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశుకు అందించా రు. దాత సాయంత్రం స్వామివారి దర్శనార్థం విచ్చేసి వీభూది పట్టీలు ఉన్న మూడు పరదాలు అందించారు. దాతకు ప్రత్యేక దర్శనం కల్పించి, వేదపండితులచే ఆశీర్వచనం, తీర్థప్రసాదాలు అందించారు.



జిల్లాకు వైరల్ ఫీవర్

- చిత్తూరు సంతపేటకు చెందిన ప్రసాద్(43) తీవ్ర జ్వరంతో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చేరాడు. 105 డిగ్రీల జ్వరం, ఒళ్లు నొప్పులు, కళ్లు తిరగడం లక్షణాలు ఉండడంతో ఇక్కడే అడ్మిట్ అయి నాలుగు రోజులుగా చికిత్స తీసుకుంటున్నాడు.
- బంగారుపాళ్యంకు చెందిన వెంకటేష్ తన కుమారుడిని (6 ఏళ్లు) జ్వరంతో ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. డాక్టర్ ఫీజు రూ.200, మందులు, మాత్రలు కలిపి రూ.850 వసూలు చేశారు. అలాగే ప్లేట్‌లెట్ కౌంట్ పరీక్ష పేరుతో మరో రూ.2 వేలు ఫీజు గుంజేశారు.



వాతావరణ మార్పులతో జిల్లాలో విష జ్వరాలు బాగా పెరుగుతున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు జ్వరపీడితులతో కిటకిటలాడుతున్నాయి. రెండు మూడు రోజుల నుంచి భారీగా కేసులు పెరుగుతున్నాయి. వారం రోజుల్లో 8 డెంగీ కేసులు నమోదు కాగా… 54 మంది తీవ్ర జ్వరంతో అడ్మిట్ అయినట్లు జిల్లా వైద్యాశాఖాధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు జ్వరం, దగ్గు, డెంగీ, విష జ్వరాల బారిన పడుతున్నారు. అప్రమత్తమైన ప్రభుత్వం ఆస్పత్రుల్లో జ్వరం పీడితుల కోసం ప్రత్యేకంగా బెడ్ల ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేసింది.

- కిటకిటలాడుతున్న ఆస్పత్రులు
- అప్రమత్తమైన ప్రభుత్వం
- మెరుగైన వైద్యానికి చర్యలు
- జ్వర పీడితులకు ప్రత్యేక వార్డులు
- వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లకు కూడా కిట్లు



జిల్లా ప్రభుత్వాస్పత్రిలో జ్వర పీడితుల వార్డులో సూచనలిస్తున్న సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్

జ్వరాల లక్షణాలు

- చలిగా ఉండడం
- కీళ్ల నొప్పులు
- ఒళ్లు నొప్పులు
- తలనొప్పి
- జలుబు
- శరీరంపై ఎరట్రి గుల్లలు
- కడుపు నొప్పి
- బీపీ తగ్గిపోవడం
- మూత్రం సక్రమంగా రాకపోవడం

చిత్తూరు ఆస్పత్రిలో ఓపీ ఇలా	
తేదీ	సంఖ్య
16	365
17	118
18	173
19	284
20	310

జిల్లా సమాచారం	
జిల్లా ప్రభుత్వాస్పత్రి	1
ఏరియా ఆస్పత్రులు	4
సీహెచ్‌సీలు	7
పీహెచ్‌సీలు	50
ప్రైవేటు ఆస్పత్రులు	2వేలకు పైగా

చిత్తూరు రూరల్: ఇటీవల కురుస్తున్న వర్షాలు.. వాతావరణ మార్పులతో జిల్లా వ్యాప్తంగా సీజనల్ వ్యాధులు పంజా విసురుతున్నాయి. జ్వరం.. జలుబుతోనే ప్రధానంగా ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో ప్రభుత్వాస్పత్రుల పరిధిలో ఓపీలు 10వేలకు పైగా వస్తున్నాయి. జిల్లా ఆస్పత్రితోపాటు పీహెచ్‌సీలకు తాకిడి పెరిగింది. ప్రతి రోజూ ప్రైవేటు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో 650కు పైగా జ్వర పీడితులు అడ్మిట్ అవుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. విష జ్వరాలు ఒకరి నుంచి మరొకరికి శరవేగంగా వ్యాప్తి చెందుతున్నాయి. దగ్గు, తుమ్ముల కారణంగా వైరస్ పక్క వారికి వ్యాపిస్తోంది. సీజనల్ వ్యాధులపై ప్రభుత్వం అప్రమత్తమైంది. రోజూ జిల్లాల్లోని ఫీవర్ కేసులపై ఆరా తీస్తోంది. ఇప్పటికే జ్వరం కేసులు వస్తే డెంగీ, మలేరియా పరీక్షలు చేయాలని ఆదేశించింది. వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లకు కూడా కిట్లు అందించింది. దీంతో క్షేత్రస్థాయిలోనే ఫీవర్ కేసులను గుర్తించే పనిలో పడ్డారు. అలాగే ఆస్పత్రుల్లో ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేశారు. జిల్లా ఆస్పత్రి, సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రుల్లో 100 బెడ్లు కేటాయించారు. ఇదే సమయంలో కొన్ని ప్రైవేటు ఆస్పత్రుల్లో టెస్టుల పేరుతో అందిన కాడికి దోచుకుంటున్నట్లు విమర్శలు వస్తున్నాయి.

పిల్లల విషయంలో జాగ్రత్త

జ్వరం వారం రోజులపాటు ఉంటుంది. జ్వరం తగ్గినా 48 గంటల వరకు చాలా జాగ్రత్తగా ఉండాలి. ప్లేట్‌లెట్లు, బీపీ తగ్గిపోవడం, మూత్రం రాకపోవడం వంటి లక్షణాలు జ్వరం తగ్గిన 48 గంటల తర్వాత బయటపడతాయి. కొబ్బరి నీరు, మజ్జిగ, పండ్ల రసాలు, ఓఆర్‌ఎస్ ద్రావణం పిల్లలకు తాగించాలి. అందుబాటులో ఉన్న మెరుగైన వైద్యశాలలో మాత్రమే పిల్లలకు చికిత్సలు చేయించాలి

–డాక్టర్ అరుణ్‌కుమార్, సూపరింటెండెంట్, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి

వైరల్‌తో భయం వద్దు..

పెద్ద చిన్న తేడా లేకుండా వైరల్ జ్వరాలు వస్తున్నాయి. సాధారణంగా జ్వరం మూడు రోజులు ఉంటుంది. తరువాత మాత్రమే వైద్య పరీక్షలు చేయించాలి. ఎలాంటి జ్వరం వచ్చినా ప్లేట్‌లెట్స్ తగ్గుతాయి. సాధారణంగా 1.5 లక్షల నుంచి 4.5 లక్షల ప్లేట్‌లెట్స్ ఉంటాయి. వీటి సంఖ్య 40 వేలకన్నా తక్కువగా ఉన్నా ప్రమాదం ఉండదు. వైరల్ ఫీవర్‌తో భయపడాల్సిన పనిలేదు. సకాలంలో వైద్యం చేయించుకోవాలి.

–డాక్టర్ ప్రభావతిదేవి, డీఎంఅండ్‌హెచ్‌ఓ చిత్తూరు

23 వరకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో ఈనెల 23వ తేదీ వరకు నిర్వహించే ప్రత్యేక ఆధార్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ క్యాంపుల నిర్వహణకు సచివాలయాల్లో తగిన ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఆధార్ కార్డు జారీతో పాటు ఇప్పటికే ఆధార్ కార్డులు ఉన్న వారు తమ వివరాలు మార్పులు, చేర్పులు చేసుకోవచ్చన్నారు. ఆధార్ కార్డు తీసుకుని పదేళ్లు పూర్తయినా ఒక్కసారి కూడా తమ ఫొటో, అడ్రస్ వంటి వివరాలు అప్‌డేట్ చేసుకోనివారు భవిష్యత్ అవసరాల దృష్ట్యా తప్పనిసరిగా మార్పులు, చేర్పులు చేసుకోవాలని యూఐడీఏఐ ఉత్తర్వులు జారీ చేసిందని పేర్కొన్నారు. ఆధార్‌కార్డు తీసుకున్నప్పటి నుంచి ఇప్పటి వరకు ఒకే అడ్రస్‌లో ఉన్నప్పటికీ అప్‌డేట్ చేసుకోవాలన్నారు.

ప్రతి సమస్యకు పరిష్కారం



అర్జీలను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

- జగనన్నకు చెబుదాం అర్జీలకు అధిక ప్రాధాన్యత
- జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

పెద్దపంజాణి: ప్రజా సమస్యల పరిష్కారానికి జగనన్నకు చెబుదాం వేదిక అని, ప్రతి సమస్యకు నిర్ణీత గడువులోగా పరిష్కారం లభిస్తుందని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో జిల్లా స్థాయి అధికారులతో జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 106 అర్జీలు వచ్చాయి. కొన్ని సమస్యలకు అక్కడికక్కడే పరిష్కార చర్యలకు ఆదేశాలు జారీ చేశారు. సమస్యలు పరిష్కారం కాకపోవడానికిగల కారణాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వినతులకు అధిక ప్రాధాన్యం ఇచ్చి పరిష్కరించాలని ఆదేశించారు. తమ పరిధిలోని సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరిం చాలన్నారు. తమ పరిధిలో లేకుంటే అర్జీదారునికి వివరంగా చెప్పాలని పేర్కొన్నారు. ఆర్థిక పరమైన అంశాలతో కూడిన అర్జీలను సంబంధిత శాఖలకు చర్యల నిమిత్తం పంపాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి బుధ, శుక్రవారాల్లో మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించడం ద్వారా సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, ఆర్డీఓ శివయ్య, డీఆర్‌డీఏ, డ్వామా పీడీలు తులసి, గంగాభవాని, జేడీ మురళీకృష్ణ, హార్టికల్చర్ అధికారి మధుసూదన్ రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ ఉమామహేశ్వర్ రెడ్డి, పీఆర్ ఈఈ చంద్రశేఖర్ రెడ్డి, డీపీఓ లక్ష్మి, డీఎల్‌డీఓ రవికుమార్, ఎంపీపీ రెడ్డెప్ప, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాగా రెడ్డి, ఎంపీడీఓ అబ్దుల్ రహీం, తహసీల్దార్ లోకేశ్వర రావు, సింగిల్ విండో చైర్మన్ ఓబుల్ రెడ్డి, ఏడీఏ శివకుమార్, వైస్ ఎంపీపీ ఆంజమ్మ, డీఈలు రమేష్ రెడ్డి, నవీన్‌కుమార్, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ముత్యాల రేడు

- అంగరంగ వైభవంగా తిరుమలేశుడి బ్రహ్మోత్సవం
- ఉదయం సింహ వాహనం, రాత్రి ముత్యపు పందిరిపై విహారం
- స్నపన తిరుమంజనంలో సేద తీరినఉత్సవమూర్తులు
- కోలాహలంగా సాంస్కృతిక కార్యక్రమాలు



ముత్యపు పందిరిపై శ్రీమన్నారాయణుడు

తిరుమల: అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుని బ్రహ్మోత్సవ సంబరాలు అంబరాన్ని తాకుతున్నా యి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు బుధవారం ఉదయం యోగనృసింహుడిగా సింహ వాహనంపై, రాత్రి శ్రీమన్నారాయణుడి అలంకరణలో ముత్యపు పందిరి వాహనాలపై ఊరేగుతూ భక్తుల కు అభయమిచ్చారు. మధ్యాహ్నం పూటకో వాహనంలో ఊరేగుతూ అలసిన స్వామివారు ఉభయ దేవేరులతో కలిసి స్నపన తిరుమంజనంలో సేద తీరారు. ఆ తర్వాత ఆలయం వెలుపల కొలువు మండపంలో వెయ్యి నేతి దీపాల వెలుగులో స్వామివారు శ్రీమన్నారాయణుని రూపంలో ఊయలూగుతూ కనువిందు చేశారు.

సాంస్కృతిక వైభవం

రాత్రి ముత్యపుపందిరి వాహన సేవకు భక్తులు పోటెత్తారు. వాహన సేవల ముందు కోలాటాలు, చెక్క భజనలు, భజన బృందాలు, వివిధ వేషధారణలు, ఉడిపి వాయిద్యం, కేరళ చండీ నత్యం, మహారాష్ట్ర కళాకారుల డోలు వాయిద్యాల కోలాహలం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కళాకారుల అభినయం, వేషధారణ విశేషంగా ఆకట్టుకుంది.

భక్తుల ఆనందం

గ్యాలరీల్లోని భక్తులకు ప్రయోగాత్మకంగా సుపథం నుంచి అనుమతించి ముత్యపు పందిరి వాహన సేవ దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా భక్తులు టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈఓ ధర్మారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



సింహ వాహనంపై యోగ నృసింహుడు

సింహ వాహన సేవలో టీటీడీ చైర్మన్, ఈఓ

సింహ వాహన సేవలో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈఓ ధర్మారెడ్డి పాల్గొని తన్మయత్వం చెందారు. అనంతరం శ్రీవారి బ్రహ్మోత్సవాలకు విచ్చేసిన చిన్నారులకు జియో ట్యాగులను కట్టారు. **కళ..భళా** ఉదయం సింహ వాహనసేవలో టీటీడీ హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో నిర్వహించిన కళా బృందాల ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది.

జగనన్నకు చెబుదాం రేపు

గుడిపాల: గుడిపాల ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు జగనన్నకు చెబుదాం కార్యక్రమం జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధ్యక్షతన జరుగనుంది. అన్నిశాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని ఎంపీడీవో రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ప్రజల నుంచి సమస్యల వినతులను స్వీకరిస్తారని పేర్కొన్నారు.

క్లుప్తంగా

టిడ్కో కాలనీ పనులు వేగవంతం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో టిడ్కో కాలనీల పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్లతో ఆయన బుధవారం సమీక్ష నిర్వహించారు. చిత్తూరు, పుంగనూరులో నిర్మిస్తున్న అర్బన్ హౌసింగ్ (టిడ్కో) పనులు అక్టోబర్ 10 లోపు పూర్తి చేసి అప్పగించాలన్నారు. పుంగనూరులో 1,536 గృహాల సముదాయం, చిత్తూరులో 2850 గృహాల సముదాయం పనులు చేపడుతున్నట్లు తెలిపారు. చిత్తూరు,పలమనేరు, పుంగనూరులో ఈటీపీ ప్లాంట్‌ల ఏర్పాటుకు భూసేకరణ చేయాలని తెలిపారు. చిత్తూరు నగరంలోని కట్టమంచి, దొడ్డిపల్లి, కైలాసపురంలో ఈటీపీ ప్లాంట్ల నిర్మాణానికి స్థల సేకరణ చేయాలన్నారు. పుంగనూరులో మురికి నీటి శుద్ధీకరణ ప్లాంట్ నిర్మాణానికి స్థల సేకరణ పూర్తి చేసి మున్సిపల్ అధికారులకు అప్పగించాలని ఆదేశించారు. చిత్తూరు కమిషనర్ అరుణ, పలమనేరు కమిషనర్ కిరణ్‌కుమార్, పుంగనూరు కమిషనర్ నరసింహప్రసాద్, పలువురు తహసీల్దార్లు పాల్గొన్నారు.

చెరువులో పడి యువకుడి మృతి

పాకాల: ప్రమాదవశాత్తు చెరువులో పడి యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని ఊట్లవారిపల్లి చెరువు వద్ద బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం.. తిరుపతి శివజ్యోతీనగర్‌కు చెందిన రంగారావు కుమారుడు కార్తీక్(16) ఒంగోలులో ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. మంగళవారం కార్తీక్ ఊట్లవారిపల్లి దళితవాడలో తన స్నేహితుడి ఇంటికి వచ్చాడు. బుధవారం ఇద్దరూ చెరువు వద్దకు బహిర్భూమికి వెళ్లారు. క్రమంలో ప్రమాదవశాత్తు కార్తీక్ కాలు జారీ చెరువులో పడి మృతిచెందాడు. పాకాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


చెరువు వద్ద పూజ చేస్తున్న భక్తులు


నిమజ్జనానికి తరలుతున్న గణనాథులు

వెళ్లిరా..వినాయకా

చిత్తూరు రూరల్: గణపతి బొప్పా మోరియా.. జైజై గణేషా అంటూ బుధవారం చిత్తూరు నగరంలో గణనాథుల నిమజ్జన శోభాయాత్ర కనులపండువగా సాగింది. చవితి రోజు నుంచి మండపాల్లో కొలువుదీరి పూజలందుకున్న లంబోదరుడిని మూడో రోజు బుధవారం నిర్వాహకులు కట్టమంచి చెరువులో నిమజ్జనం చేశారు. చెరువు వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు కోలాహలం నెలకొంది. ఆయా ప్రాంతాల నుంచి ప్రత్యేక వాహనాల్లో వినాయక విగ్రహాలను కొలువుదీర్చి డప్పు వాయిద్యాల నడుమ చిన్నారులు, పెద్దలు జై భోలో గణపతి మహారాజ్‌కి జై అంటూ ఊరేగింపుగా కట్టమంచి చెరువు వద్దకు చేరుకున్నారు. ఊరేగింపుగా వస్తున్న స్వామి వారికి భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించారు. నగరపాలక సంస్థ అధికారులు చెరువు వద్ద ముందస్తు ఏర్పాట్లు చేశారు. విద్యుత్ అలంకరణ నుంచి జలాధి పూజకు ఇబ్బందులు లేకుండా టేబుళ్లు ఏర్పాటు చేశారు. భారీ విగ్రహాలను జలాధి చేసేందుకు క్రేన్‌ను అందుబాటులో ఉంచారు. పారిశుధ్య పరంగా ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించేలా బృందాన్ని ఏర్పాటు చేశారు. ఏర్పాట్లపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా, ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా పోలీసులు పటిష్ట చర్యలు తీసుకున్నారు. నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించేలా దగ్గరుండి కమిషనర్ అరుణ చర్యలు చేపట్టారు.


జైబోలో గణేష్ మహరాజ్..


వక్రతుండ మహాకాయ..


క్రేన్‌తో నిమజ్జనం

విద్యా సంస్థల్లో ప్రత్యేక ఓటరు నమోదు


సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో 18 సంవత్సరాలు నిండిన యువతను ఓటర్లుగా నమోదు చేయించేందుకు అధికారులతో పాటు రాజకీయపార్టీల నాయకులు సహకరించాలని కలెక్టర్ షణ్మోహన్ సూచించారు. బుధవారం గుర్తింపు పొందిన రాజకీయపార్టీల నాయకులు, పలు శాఖల అధికారులతో వరుస సమీక్షలు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి నూతన ఓటర్లను నమోదు చేయించాలన్నారు. కళాశాలల ప్రిన్సిపల్స్‌తో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించాలని చెప్పారు. జిల్లాలో పది కంటే ఎక్కువ మంది ఓటర్లు ఉన్న గృహాలను గుర్తించి ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం చేసినట్లు తెలిపారు. ఈనెల 22న మరోసారి గుర్తింపు పొందిన రాజకీయపార్టీల నాయకులతో సమావేశం నిర్వహించి, అనంతరం తుది ఓటర్ల జాబితాను రాష్ట్ర ఎన్నికల అధికారికి పంపుతామని పేర్కొన్నారు. వివాహితులు, ఇతర రాష్ట్రాలకు వెళ్లిన ఓటర్ల గుర్తించి జాబితా నుంచి తొలగించాలని బీఎల్‌వోలను ఆదేశించారు. 2018 కంటే ముందు గోడౌన్‌లో ఉన్న ఈవీఎంలను రాష్ట్ర ఎన్నికల అధికారులను పంపినట్లు చెప్పారు. జిల్లాకు 2600 నూతన ఈవీఎం వచ్చాయన్నారు. వాటిని కట్టుదిట్టమైన భద్రత నడుమ భద్రపరిచినట్లు తెలిపారు. డీఆర్‌వో రాజశేఖర్, వైఎస్సార్ సీపీ, టీడీపీ, సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ పార్టీల నుంచి ప్రతినిధులుగా ఉదయ్, సురేంద్రకుమార్, నాగరాజు, గంగరాజు, పరదేశి పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనుల్లో వైఎస్సార్ విగ్రహం తొలగింపు

- త్వరలోనే మరోచోట ప్రతిష్ట – కమిషనర్


విగ్రహం తమ స్వాధీనంలోనే ఉందని చెబుతున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని కలెక్టరేట్ కూడలిలో ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని అధికారులు తొలగించారు. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా విగ్రహాన్ని ఇక్కడి నుంచి తీసి, భద్రపరచినట్లు అధికారులు పేర్కొన్నారు. బుధవారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ అరుణ మీడియాతో మాట్లాడుతూ.. 'బెంగళూరు–చెన్నై ఎన్‌హెచ్–4 రోడ్డు విస్తరణ పనులకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌రాజశేఖరరెడ్డి విగ్రహం అడ్డంగా ఉందని ఎన్‌హెచ్ అధికారులు చెప్పడంతో అక్కడి నుంచి తొలగించాం. విగ్రహాన్ని కార్పొరేషన్ అధికారులు భద్రపరచారు. విగ్రహాన్ని త్వరలోనే సముచిత స్థానంలో ఏర్పాటు చేస్తాం.' అని తెలిపారు. కలెక్టరేట్ కూడలి వద్ద వై జంక్షన్ కూడలి, ఫ్లైఓవర్ నిర్మిస్తున్న నేపథ్యంలో విగ్రహాన్ని తొలగించినట్లు కమిషనర్ తెలిపారు.

కేబినెట్ నిర్ణయాలపై ఉద్యోగుల హర్షం


ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మున్సిపల్ ఉద్యోగులు

నగరి : ఉద్యోగులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వరాలు కురిపించడం పట్ల స్థానిక మున్సిపల్ ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేశారు. బుధవారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయం వద్ద ముఖ్యమంత్రి జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు మునిమోహన్, కార్యదర్శి భారతి మాట్లాడుతూ కేబినెట్ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు విరమణ పొందే సమయానికి ఇంటి స్థలం లేని వారికి కచ్చితంగా ఇంటి స్థలం ఏర్పాటు చేయడం ప్రభుత్వ బాధ్యతగా ఉండాలని, ఉద్యోగులకు వారి పిల్లలకు ఆరోగ్యశ్రీ పథకం వర్తింపజేయాలని, ఉద్యోగుల పిల్లలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తింపజేయాలని నిర్ణయం తీసుకోవడం హర్షణీయమన్నారు. అలాగే కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, ప్రభుత్వ ఉద్యోగులకు జీపీఎస్ అమలు ముసాయిదా బిల్లులపై చర్చలు నిర్వహించడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. కేబినెట్ తీసుకున్న నిర్ణయాలకు నగరి పురపాలక సంఘ ఉద్యోగ సంఘం తరఫున ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నగరి పురపాలక సంఘ ఉద్యోగ సంఘ సభ్యులు మేనేజర్ కె.శేఖర్, రెవెన్యూ అధికారి ఎంజీ మణిశంకర్, అసిస్టెంట్ ఇంజినీర్ కె.రమేష్, ఎం.నవీన్, సీనియర్ అసిస్టెంట్ ఎం.చంద్రకాంత్, జూనియర్ అసిస్టెంట్లు టి.కుమార్, జి.లీలావతి, ఎస్.ఉషా, జె.మోహన్,ఎ.కిషోర్ కుమార్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

సంప్రదాయానికి అనుగుణంగా జాతర


తాంబూలం పంపిణీ చేస్తున్న వెంకటగిరి రాజా కుటుంబీకులు

- అమ్మవారి జాతర నిర్వహణకు రాజాల అనుమతి
- భక్తిపారవశ్యంతో తొలి చాటింపు

వెంకటగిరి రూరల్: వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మతల్లి జాతర నిర్వహణ సంప్రదాయానికనుగుణంగా భక్తి పారవశ్యంతో కొనసాగించాలని వెంకటగిరి రాజా కుటుంబీకులు, ఎస్వీబీసీ చైర్మన్ డాక్టర్ వీబీ.సాయికృష్ణ యాచేంద్ర తెలిపారు. పోలేరమ్మతల్లి జాతర నిర్వహణకు సంబంధించి వెంకటగిరి రాజా ప్యాలెస్‌లోని బొడ్డుపైగా మండపంలో బుధవారం జాతర నిర్వాహకులు (పనిబాటల వాలు)లకు సంప్రదాయబద్ధంగా తాంబూలం అందించగా.. రాజా కుటుంబీకులు సర్వజ్ఞ యాచేంద్ర పనిబాపనవాలకు తాంబూలం పంపిణీ చేశారు. అనంతరం బుధవారం రాత్రి జాతర నిర్వహణకు మొదటి చాటింపు వేశారు. ఈ సందర్భంగా ఎస్వీబీసీ చైర్మన్ వీబీ.సాయికృష్ణ యాచేంద్ర మాట్లాడుతూ వెంకటగిరిలో గతంలో కలరా, మసూచి వంటి వ్యాధులు సోకినప్పుడు తమ మునితాత అయిన రాజాగోపాలకృష్ణ యాచేంద్ర సీతల యాగం చేయించి వెంకటగిరిలో గమిడిరాళ్లు ఏర్పాటు చేసి జాతర నిర్వహించారని, అప్పటి నుంచి వెంకటగిరి సుభిక్షంగా ఉందన్నారు. ప్రస్తుతం ఈ ఏడాది రాష్ట్ర పండుగగా గుర్తిస్తూ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జీఓ విడుదల చేశారని, దీనికి కృషి చేసిన నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అమ్మవారి జాతరకు 15 రోజుల సమయం ఉందని, ప్రజలంతా ఏకమైన వైభవో పేతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు నెమళ్ల పూడి సురేష్‌రెడ్డి, పట్టణ కన్వీనర్ జీ.ఢిల్లీబాబు, జేసీఎస్ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి, ఆలయ ఈఓ శ్రీనివాసులురెడ్డి, పోలేరమ్మతల్లి జాతర నిర్వహణ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

– మరోకరి పరిస్థితి విషయం


మృతి చెందిన ఆనందయ్య

గంగాధరనెల్లూరు : గంగాధరనెల్లూరు మండలం ఆరిమాకులపల్లె మలుపు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరోకరు పరిస్థితి విషమంగా ఉంది. ఇన్‌చార్జి ఎస్‌ఐ ఉమామహేశ్వరెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. గంగాధరనెల్లూరు నుంచి బలిజకండ్రిగ వైపుగా పది మందితో ఆటోలో వస్తున్నారు. ఇదే క్రమంలో తూగుండ్రం నుంచి పూతలపట్టు మండలం పోలవరం గ్రామానికి చెందిన కార్తీక్ స్కూటీలో వస్తున్నాడు. ఆరిమాకులపల్లె మలుపు వద్ద స్కూటీని ఆటో ఢీకొంది. ఈఘటనలో ఆటో బోల్తాపడింది. ఆటోలో ప్రయాణిస్తున్న ఆనందయ్య(60) మృతి చెందాడు. స్కూటీ నడుపుతున్న కార్తీక్ తీవ్రంగా గాయపడ్డాడు. 108 వాహనంలో చిత్తూరు ప్రభుత్వం ఆస్పత్రికి తరలించారు.

స్నేహితుడిని డ్రాప్ చేసి వస్తూ ..

– రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


రఫీ (ఫైల్)


మృతి చెందిన రఫీ

పలమనేరు: స్నేహితుడిని ఇంటి వద్ద దిగబెట్టి తిరిగి వెళుతూ రోడ్డు ప్రమాదానికి గురై ఓ యువకుడు అక్కడిక్కడే మృతి చెందిన సంఘటన మంగళవారం అర్ధరాత్రి పట్టణంలోని రంగబాబు సర్కిల్‌లో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సుబ్బారెడ్డి కథనం మేరకు.. పట్టణంలోని శ్రీనగర్‌కాలనీకి చెందిన రఫీ(23) తన బైక్‌పై స్నేహితుడిని ఇంటి వద్ద డ్రాప్ చేసి తిరిగి వస్తున్నాడు. రంగబాబు సర్కిల్‌లో రోడ్డు క్రాస్ చేస్తుండగా బైక్‌ను తిరుపతి వైపు వెళుతున్న కేఎస్‌ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో రఫీ అక్కడిక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాళాలు వేసిన ఇళ్లే టార్గెట్

- పగలు, రాత్రి తేడా లేకుండా దొంగతనాలు
- తనిఖీల్లో ఇద్దరు గజ దొంగలను పట్టుకున్న చంద్రగిరి పోలీసులు
- 340 గ్రాముల బంగారు, 1,750 గ్రాముల వెండి ఆభరణాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ యశ్వంత్


స్వాధీనం చేసుకున్న సొత్తును పరిశీలిస్తున్న డీఎస్పీ యశ్వంత్, సీఐ రాజశేఖర్

చంద్రగిరి: తాళాలు వేసిన ఇళ్లే టార్గెట్‌గా రెచ్చిపోతున్న కేటుగాళ్ల ఆటకట్టించారు చంద్రగిరి పోలీసులు. ఇద్దరు గజ దొంగలను అదుపులోకి తీసుకుని భారీగా బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు బుధవారం చంద్రగిరి డీఎస్పీ యశ్వంత్ మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. మండల పరిధిలోని తొండవాడ సమీపంలో బుధవారం పోలీసులకు వచ్చిన పక్కా సమాచారంతో సీఐ రాజశేఖర్‌తో కలిసి వాహన తనిఖీలు చేపట్టారని, ఈ క్రమంలో తొండవాడ బస్‌స్టాప్ వద్ద అనేక కేసుల్లో ముద్దాయిలుగా ఉన్న పీలేరుకు చెందిన ఒంటిపులి శ్రీనివాసులు, పాకాలకు చెందిన వేమూరి పాపయ్య నాయుడును అదుపులోకి తీసుకున్నట్టు వెల్లడించారు. నిందితులను విచారించగా తిరుపతి రూరల్, చంద్రగిరి, తిరుచానూరు, నారాయణవనం, పిచ్చాటూరు పరిసరాల్లో దొంగతనానికి పాల్పడినట్లు వెల్లడైందని తెలిపారు.

నిందితులపై కేసులు

దొంగతనాల్లో పట్టుబడిన నిందితులపై తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో అనేక కేసులు నమోదైనట్లు డీఎస్పీ తెలిపారు. ఇందులో వేమూరి పాపయ్య నాయుడు 1999 నుంచి దొంగతనాలకు పాల్పడుతుండగా.. ఇతనిపై సుమారు 90కి పైగా కేసులు ఉన్నాయన్నారు. ఇప్పటికే పాకాల పోలీసు స్టేషన్‌లో అతనిపై డీసీ షీట్ ఉన్నట్లు వెల్లడించారు. అదేవిధంగా ఒంటిపులి శ్రీనివాసులుపై సుమారు 50కి పైగా కేసులు ఉన్నాయని తెలిపారు. ఇద్దరూ కలిసి ఎవరూ లేని ఇళ్లను టార్గెట్ చేసి దొంగతనాలకు పాల్పడుతుంటారని వెల్లడించారు. దొంగతనం చేసిన వస్తువులను తమిళనాడు, కర్ణాటక ప్రాంతాల్లోకి వెళ్లి విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. చంద్రగిరిలో కూడా ఓ ఇంట్లో దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించినట్టు పేర్కొన్నారు.

ఆభరణాల స్వాధీనం

నిందిల నుంచి సుమారు రూ.17 లక్షల విలువైన 340 గ్రాముల బంగారు, 1,750 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ తెలిపారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్టు పేర్కొన్నారు.

అవయవ దాత కుటుంబానికి చేయూత


కీర్తి తల్లిదండ్రులకు రూ.5 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్, రూ.50 వేల శ్రీసిటీ చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

పిచ్చాటూరు: అవయవాల దానంతో ఏడుగురి ప్రాణాలు కాపాడిన కీర్తి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం స్పష్టం చేశారు. బుధవారం ఉదయం కీర్తి స్వగ్రామమైన మండలంలోని రామాపురం దళితవాడకు చేరుకున్న ఆయన అవయవ దాత చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం రూ.5 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును కీర్తి తల్లిదండ్రులకు అందజేశారు. కీర్తి రోడ్డు ప్రమాదంలో బ్రెయిన్ డెడ్ అయి తన అవయవాలతో ఏడుగురికి ప్రాణం పోసిందన్నారు. కీర్తి కుటుంబం కడు పేదరికంలో ఉందని, ఆమెకు ఇద్దరు చెల్లెళ్లు, తమ్ముడు ఉన్నారని, వారి చదువుల బాధ్యత తమదని తెలిపారు. అలాగే ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగం ఇప్పిస్తామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఇదిలావుండగా శ్రీసిటీ యాజమాన్యం కీర్తి కుటుంబానికి రూ.50 వేల చెక్కును అందజేయగా.. శ్రీసిటీ ఎండీ రవిసన్నారెడ్డికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కేవీ.చలపతిరాజు, రాష్ట్ర కార్యదర్శి కేవీ.భాస్కర్‌నాయుడు, ఎంపీటీసీ సభ్యులు రమేష్ రాజు, శోభన్, సర్పంచ్‌లు కిరణ్‌కుమార్, రామగిరి ఆలయ చైర్మన్ వెంకటేశులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.